క్లుప్తంగా

వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతిగా సీతారాం



పొన్నాడ సీతారాం

సీతంపేట: స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతిగా పొన్నాడ సీతారాం గురువారం బాధ్యతలు చేపట్టారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి ఈయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన జి.నారాయణస్వామి సత్యసాయి జిల్లా మడకశిర వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలకు బదిలీపై వెళ్లారు.

రెండో విడత సిమెంటు సిద్ధం



సిమెంటును దింపిస్తున్న హౌసింగ్ సిబ్బంది

భామిని: మండలానికి మంజూరైన పీఎంఏవై గృహ నిర్మాణాలు వేగవంతానికి అనువుగా రెండో విడత సిమెంటు సిద్ధం చేసినట్టు హౌసింగ్ ఏఈఈ గుంప అప్పలనాయుడు గురువారం తెలిపారు. హౌసింగ్ కార్యాలయానికి 600 బస్తాల సిమెంటు వచ్చినట్టు తెలిపారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులను కోరారు. ఆయన వెంట హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

డయాలిసిస్ రోగికి రూ.10వేల పింఛన్ అందజేత



రఘుపతినాయుడుకు పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ తొగరాన శ్రీను, డబ్ల్యూఏ రాజేష్

భామిని: పెద్దదిమిలికి చెంది బుయ్యాల రఘుపతి నాయుడు డయాలిసిస్‌తో బాధపడుతుండగా ప్రభుత్వం కొత్తగా రూ.10వేల పింఛన్ మంజూరు చేసింది. ఈ మేరకు పింఛన్ మొత్తాన్ని రఘుపతినాయుడు ఇంటికి వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేష్ పట్నాయిక్, సర్పంచ్ తొగరాన శ్రీను వెళ్లి గురువారం నగదు అందజేశారు. ఇలా డయాలిసిస్‌తో బాధపడుతున్న నల్లరాయిగూడకు చెందిన ఆదివాసీ యువకుడు బిడ్డిక నగేష్, బిడ్డిక నగేష్‌కు రూ.10వేల పింఛన్ అందజేశారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరం



ఉల్లిబద్రలో జరిగిన గ్రామ సభలో పాల్గొన్న సర్పంచ్ తదితరులు

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరమని పంచాయతీ కార్యదర్శి యు.కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మి అధ్యక్షతన గ్రామ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామసభలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ స్తంభాల మార్పిడి

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో విరిగిన విద్యుత్ స్తంభాల స్థానాలు కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈపీడీసీఎల్ ఏఈ సోమేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు జోగింపేటలో సర్పంచ్ కె.సింహాచలం ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యుత్ లైన్ల మరమ్మతులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో గతంలో వేసిన విద్యుత్ స్తంభాలు శిథిల మవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఇప్పలవలస, జోగింపేట, వెంకటాపురం, నిడగల్లు, రేపటివలస గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు మార్చినట్లు తెలిపారు. శాఖాపరమైన ఇబ్బందులు నివారించడానికి సత్వరచర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

బలిజిపేట: రానున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పన ఏ విధంగా ఉందనే దానిపై ముగ్గురు సభ్యుల కమిటీ బలిజిపేట ఉన్నత పాఠశాలను గురువారం పర్యవేక్షించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేర ఎంఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెదపెంకి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామారావు, చిలకలపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకరరావులు పర్యవేక్షించిన వారిలో ఉన్నారు. పరీక్షలు జరిగే బలిజిపేట ఉన్నత పాఠశాలలోని ఎ,బి కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నవీ లేనివీ గమనించారు.

ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేపట్టాలి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, పక్కన ఎమ్మెల్సీ విక్రాంత్

- మండల సమావేశంలో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

వీరఘట్టం: రైతు పండించే ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వీరఘట్టం మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వీరు మాట్లాడారు. మండలంలో 33 వేల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇంత వరకు 8 వేల టన్నుల మాత్రమే కొనుగోలు చేసామంటే ధాన్యం కొనుగోలులో చాలా వెనుకబడి ఉన్నామన్నారు.రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో వీరు ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయానికి ఎంతో ప్రాధాన్యం ఉన్న వీరఘట్టం మండలం వైపు జిల్లా అధికారులు దృష్టి సారించాలని, ధాన్యం కొనుగోలు సత్వరం చేపట్టేలా చొరవ చూపాలని కోరారు. మండలంలో పలుచోట్ల విద్యుత్ సమస్య ఉందని వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. రూ.76 కోట్లతో ఈ ఏడాది మండలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం చేపట్టిన అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తోందని, ఈ నిధులతో ప్రధాన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీలు పత్రి విజయకుమారి, విశ్వాసరాయి భార్గవ్, ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి లీలాప్రసాదరావు, కర్రి గోవిందరావు, దమలపాటి ఉమా, వావిలపల్లి ఉషారాణి, శిష్టు మధుసూధనరావు, వావిలపల్లి పురుషోత్తమరావు నాయుడు, మండల శాఖ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ కళావతి

గుమ్మలక్ష్మీపురం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడాకారుల్లో ఐక్యత పెరుగుతుందని బాలేసు సర్పంచ్ మండంగి కళావతి అన్నారు. మండలంలోని బాలేసు గ్రామంలో యువత నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె స్థానిక పాఠశాల హెచ్‌ఎం సిరికి స్వామినాయుడుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. పోటీల్లో బయ్యాడ, బాలేసు, గాంద్ర, రేగిడి, బాలేసుగూడ గ్రామాల నుంచి ఎనిమిది జట్లు పాల్గొన్నాయి.

ఎంపీడీఓపై జెడ్పీ సీఈఓ మండిపాటు



ఎంపీడీఓ కృష్ణారావును హెచ్చరిస్తున్న సీఈఓ వెంకట్రామన్

భామిని: ఎంపీడీఓ గుర్ల కృష్ణారావుపై శ్రీకాకుళం జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ గురువారం మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన సీఈఓ రికార్డులు పరిశీలించారు. విధి నిర్వహణలో ఎంపీడీఓ తీరు మారకపోవడంతో తీవ్రంగా హెచ్చరించారు. విధి నిర్వహణ సమయంలో అందుబాటులో లేకుండా, ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేయడంపై హెచ్చరించారు. ఏ స్థానం నుంచి ఎంపీడీఓగా వచ్చారో గుర్తించుకోవాలని ఆగ్రహించారు. సిబ్బందితో మాట్లాడారు.

అవ్వాతాతలకు అండగా సీఎం జగన్

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



కొత్తగా మంజూరైన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

పాలకొండ/పాలకొండ రూరల్: అవ్వాతాతలకు అండగా ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ఉన్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండల కేంద్రంలో కొత్త పింఛన్ల పంపిణీని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉండగా పింఛన్ల పంపిణీ రాజకీయం చేశారని, జన్మభూమి కమిటీలకు అప్పగించి వేధించారని విమర్శించారు. ప్రస్తుతం జగన్‌మోహనరెడ్డి అర్హులందరికీ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పెంపు చేపట్టారని తెలిపారు. పాలకొండ పట్టణ పరిధిలో 98 నూతన పింఛన్‌లు, మండలం పరిధిలో 198 నూతన పింఛన్‌లు మంజూరు చేశారని వివరించారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి, ఎంపీపీ బొమ్మాలి బాను, కమిషనర్ సర్వేశ్వరరావు, ఎంపీడీఓ త్రినాధరావు, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్‌రావు, వాకముడి అనిల్‌కుమార్, వైస్ చైర్మన్ రైతు హనుమంతురావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వలంటీర్లు, సచివాలయల సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోలు



లప్పటిలో అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న జీసీఎంఎస్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం: అటవీ ఉత్పత్తులను గిరిజనుల చెంతకే వెళ్లి కొనుగోలు చేస్తున్నట్టు జీసీఎంఎస్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు తెలిపారు. జీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ క్రిష్ణప్రసాదరావు ఆదేశాలతో ఆయన సేల్స్‌మెన్లతో కలిసి లుంబేసు పంచాయతీలోని గిరిశిఖర గ్రామాల నుంచి తీసుకొచ్చిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. 15 క్వింటాళ్ల కరక్కాయలు, ఆరు క్వింటాళ్ల నరమామిడి బెరడు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా తామే స్వయంగా గిరిజన గ్రామాలకు వెళ్లి అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. అటవీ ఉత్పత్తులను తమ గ్రామాలకు వచ్చి కొనుగోలు చేస్తుండడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోగులకు మరిన్ని సేవలందాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. మందులు, వైద్యులు కొరత లేకుండా అన్ని వసతులు కల్పించిందని తెలిపారు. వైద్యులు మానవతా దృక్పథంతో వ్యవహరించి సేవలు అందించాలని తెలిపారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆస్పత్రి సేవలపై రోగుల్లో అసంతృప్తి ఉందని తెలిపారు. రోగులకు మంచి సేవలు అందించడం ద్వారా గుర్తింపు తీసుకురావాలని తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు, ఆర్ఎంఓ రవీంద్రకుమార్, వైద్యులు పాల్గొన్నారు.

చెరకు రైతులకు అండగా ఉంటాం..



మాట్లాడుతున్న నేతలు, కర్మాగారం అధికారులు

పాలకొండ రూరల్: చెరకు రైతులకు ప్యారిస్ కర్మాగారం తరఫున అండగా ఉంటామని సంస్థ ఏజీఎం కె.అప్పారావు అన్నారు. పాలకొండ మండలం అంపిలి గ్రామంలో సంబంధిత రైతులు చెరకు పంటలను విస్తృతంగా పండించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. అలాగే చెరకులో అంతర్ కృషి, వాడుకోదగిన యంత్రాలు, బోర్లు, పైపులైన్ల ఏర్పాటుకు కర్మాగారం తరఫున అందించే రాయితీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తమ గ్రామంలో దాదాపు నాలుగు వందల ఎకరాల్లో చెరకు సేద్యం చేపడుతున్నారన్నారు. వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్, చెరకు రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వీరఘట్టం: మండలంలోని పాలమెట్ట – 1 సెంటర్, వీరఘట్టం బీసీ కాలనీలో 6 – సీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు పీఓ యు.పూర్ణిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు పోస్టులను బీసీ–బీ అభ్యర్థులకు కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలల్లోపు అర్హులైన అభ్యర్థులు స్థానిక కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. పదో తరగతి పాసై, 35 ఏళ్లలోపు ఉన్న వివాహిత మహిళలు అర్హులని తెలిపారు. వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

రీసర్వేపై దృష్టి సారించండి

- సబ్ కలెక్టర్ నూరల్ కమర్



రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

జియ్యమ్మవలస: భూ రీసర్వేపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. గయ్యాళి, పోరంబోకు భూములను గుర్తించాలని సూచించారు. రైతుల భూ సమస్యల పరిష్కారంలో రీసర్వే ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. ప్రతి పంచాయతీలో సంబంధిత వీఆర్‌ఓలు ముందస్తు ప్రణాళికలు తయారు చేసి ముందుకు వెళ్లాలన్నారు. సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్ సీతారామయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి, గోదాదేవికి పూజలు



పల్లకిలో ఊరేగుతున్న గోదాదేవి అమ్మవారికి

సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహ స్వామి వారికి, అలాగే వేణుగోపాలస్వామి ఆలయంలోని గోదా దేవి అమ్మవారికి వైభవంగా పూజలు జరిగాయి.ఈ మేరకు ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రతి గురువారం పలు గ్రామాల నుంచి భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు లక్ష్మీనృసింహస్వామి వస్తుంటారని తెలిపారు. అలాగే ధనుర్మాసం ఉత్సవాలను పురస్కరించుకుని వేణుగోపాలస్వామి, గోదాదేవి అమ్మవార్లకు నిత్యం పూజలు జరుగుతున్నాయని తెలియజేశారు. ప్రతిరోజూ పూజలనంతరం గోదాదేవి అమ్మవారిని గోవింద మాలధారులంతా కలిసి పల్లకిలో అధిష్టించి తిరువీధి చేస్తూ గోవింద నామస్మరణ చేస్తున్నట్లు చెప్పారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు సమకూర్చిన నిధులతో ప్రసాదాల వితరణ నిర్వహిస్తున్నామని అన్నారు.

19 వలంటీర్ పోస్టులు ఖాళీ

సాలూరు: పట్టణంలోని పది సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 19 వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక సచివాలయాల్లో లేదా పురపాలక సంఘ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



కొండలేవిడి గిరిజన గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: ప్రజా సమస్యల పరిష్కారమే తమ ముందున్న లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరుగుతున్నాయన్నారు. మండలంలోని పి.లేవిడి గ్రామంలో సర్పంచ్ కవిత ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతున్నాయన్నారు. పంచాయతీ పరిధిలోని కొండలేవిడి, పి.లేవిడి గిరిజన గ్రామాల్లో ప్రతీ గడపకు వెళ్లి మూడేన్నరేళ్ల పాలనలో లబ్ధి పొందిన సంక్షేమ పథకాలను వివరించారు. అందుతున్న సంక్షేమ ఫలాలపై లబ్ధిదారులకు వివరించారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ రాజేశ్వరి, ఉమ్మడి జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, జెడ్పీటీసీ గౌర్లి సుజాత, ఎంపీటీసీలు విద్యారాణి, వైస్ ఎంపీపీ రంగారావు, మాజీ జెడ్పీటీసీ అందవరపు కోటేశ్వరరావు, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, నీలకంఠాపురం సర్పంచ్ మన్మథరావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందిరాకుమారి, మాజీ ఏఎంసీ చైర్మన్ నిమ్మల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

డీడీలు కట్టక విడుదల కాని బియ్యం



డీటీ శేఖరానికి సమస్యలు వివరిస్తున్న ఎండీఎం ఆపరేటర్లు

భామిని: మండలంలోని రేషన్ డీలర్లు డీడీలు కట్టక పోవడంతో రేషన్ బియ్యం విడుదల కావడం లేదని, జనవరి నెల రేషన్ అందివ్వడంలో జాప్యం ఏర్పడిందని ఎండీఎం మండల వాహన ఆపరేటర్లు అధికారులకు మొర పెట్టుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎండీఎం ఆపరేటర్లు సమస్యలు వివరించారు. జనవరి -5 దాటినా రేషన్ స్టాక్ రాలేదని మండలంలో ఎక్కడా పంపిణీ చేయలేకపోయామన్నారు. గ్రామంలో వలంటీర్లు బియ్యం పంపిణీలో సహకరించడం లేదన్నారు. పీడీఎస్ రైస్‌తో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వ బియ్యం అందిస్తున్నా తగిన వేతనాలు అందడం లేదని వాపోయారు. తక్షణమే రేషన్ డీలర్లతో డీడీలు కట్టించి రేషన్ బియ్యం విడుదల చేయించాలని కోరారు. ఎండీఎం ఆపరేటర్లు, రెవెన్యూ అధికారి చందు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



పాఠశాలలో నాడు - నేడు పనులను పరిశీలించి సూచనలిస్తున్న డీఈఓ రమణ

జియ్యమ్మవలస: మండలంలోని చినకుదమ, పిప్పలబద్ర ఉన్నత పాఠశాలలను పార్వతీపురం మన్యం జిల్లా విద్యా శాఖాధికారి ఎస్‌డీవీ రమణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలకు మంజూరైన అదనపు తరగతి గదులను, నాడు – నేడు పనులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సమ్మేటివ్ 1 పరీక్షలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



శెట్టి లక్ష్మణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు సోదరుడు, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి బావ అయిన శెట్టి లక్ష్మణరావు (55) వారం రోజుల కిందట అనారోగ్యంతో స్వగ్రామం గోశవలస గ్రామంలో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆమె వెంట కురుపాం జెడ్పీటీసీ గౌర్లి సుజాత, కురుపాం గ్రామ సర్పంచ్ గార్ల సుజాత ఉన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి



మాదలింగి జెడ్పీ హైస్కూల్‌లో నాడు - నేడు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ శ్యామల

కొమరాడ: నాడు – నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ శెట్టి శ్యామల అన్నారు. మండలంలోని మాదలింగి జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులను ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదలింగి జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.41 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. వీటితో పాఠశాల రూపురేఖలు మారిపోతాయన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో గురువారం చేరాయి. గ్రామ వార్డు మెంబర్ కొనాడ దుర్గారావుతో పాటు పది కుటుంబాలకు చెందిన వారు ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ సమక్షంలో పార్టీ కండువాలు వేసుకున్నారు.

ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేపడుతున్న సంక్షేమ పథకాలతో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పార్టీ నాయకులు శాసుబిల్లి జనార్ధనరావు, ఎస్.గాంధీ, ఎం.వసంతరావు, బలగ నాయుడుబాబు, పతివాడ మోహన్, శాసుబిల్లి శంకరావు, పాండ్రింకి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సంఘాల బలోపేతమే లక్ష్యం



వైకేపీ సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీ నారాయణరావు

పాలకొండ రూరల్:

వైఎస్సార్ క్రాంతి పథం(వైకేపీ) సంఘాల బలోపేతానికి సిబ్బంది కృషి చేయాలని వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ (ఏసీ) నారాయణరావు అన్నారు. పాలకొండ కార్యాలయంలో ఏపీఎంలు, సీసీలతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా మహిళలకు కేటాయించిన ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా లబ్ధి పొందిన సభ్యులచే యూనిట్లు ఏర్పాటు చేయించాలన్నారు. మండలాల వారీగా సంఘాల బ్యాంక్ లింకేజీలు, పొందిన రుణాలు, వాటి తాజా స్థితిగతులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు పొందలేని సంఘాలు, సభ్యులు ఉంటే వారిని గుర్తించి నివేదికలు అందించాలన్నారు. సమావేశంలో మన్యం జిల్లా డీపీఎం ఎల్‌హెచ్ ప్రవీణ్‌కుమార్, పాలకొండ, వీరఘట్టం ఏపీఎంలు ఎం.సూరమ్మ, బి.శివున్నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.